క్లుప్తంగా

రేషన్ పంపిణీ చేసిన మంత్రి

సాలూరు: పట్టణంలోని చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీశిశు,గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె రేషన్ లబ్ధిదారులకు రేషన్ సరుకులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌వీరమణ, పలువురు అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రెండు ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంల నియామకం



నూతన హెచ్‌ఎంల నుంచి జాయినింగ్ రిపోర్టులు తీసుకుంటున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: విద్యాశాఖ నిర్వహించిన బదిలీల్లో భాగంగా మండలంలోని రెండు ప్రాథమిక పాఠశాలలకు నూతన ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్ విధానంలో నియమితులయ్యారని ఎంఈఓ జి.సూరిదేముడు తెలియ జేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ సూరిదేముడు ఆదివారం మాట్లాడుతూ చినభోగిలి ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంగా సీహెచ్ మేరీగ్రేస్, నిడగల్లు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎంగా రెడ్డి పైడిపినాయుడు నియమితులయ్యారని తెలిపారు. వారిద్దరూ జాయినింగ్ రిపోర్టు అందజేశారన్నారు.

మరిపివలస జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా విజయలక్ష్మి ..

మండలంలోని మరిపివలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జి.విజయలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంతవరకూ ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వహించిన ఓలేటి తవిటినాయుడు నూతన హెచ్‌ఎం విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు.

భక్తి శ్రద్ధలతో దేశతల్లి వారాలు



మొక్కులు తీర్చేందుకు వెళ్తున్న భక్తులు



దేశతల్లి ఊరేగింపులో డప్పు వాయిద్యాలతో పాల్గొన్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని నడిమిములగ గ్రామంలో ఆదివారం దేశతల్లి వారాలను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో డప్పు వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగిస్తూ భక్తిని చాటుకున్నారు. అలాగే గ్రామ ప్రారంభంలో ఉన్న పాటిపాలెం ఆవరణకు గ్రామస్తులంతా తమ కుటుంబ సభ్యులతో చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ

రేగిడి: ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అంతా కలిసి కృషి చేద్దామని స్వచ్ఛభారత్ మండల కో-ఆర్డినేటర్ పద్మ అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే పర్యావరణ ముప్పుపై మండలంలోని బూరాడ గ్రామస్తులకు ఆదివారం ఆమె అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణ కాలుష్యమవుతుందని అన్నారు. జూన్5న పర్యా వరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఎంపీడీఓ శ్యామలాకుమారి ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి, తదితరులు పాల్గొన్నారు.

కోటా కష్టాలు మొదలు

- పేదలను అవస్థలకు గురిచేస్తున్న కూటమి సర్కార్



మక్కువ: మార్కొండపుట్టిలో శిథిలావస్థకు చేరుకున్న జీసీసీ గోదాములో క్యూలో ఉన్న లబ్ధిదారులు

పార్వతీపురం రూరల్/సీతానగరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పేదవారి సంక్షేమానికి పెద్దపీట వేసి వారిని ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు గురిచేయకుండా సంక్షేమాన్ని నేరుగా వారి ఇంటికే వద్దనే ఇచ్చే విధంగా కార్యాచరణ చేసి చరిత్రలో విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టింది. అయితే నేడు కూటమి సర్కార్ తీరుతో ఎండీయూ వాహనాలతో ఇళ్లకే రేషన్ సరఫరా నిలిపివేతతో పేదలను అవస్థలకు గురిచేసే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన రేషన్ సరుకులను నెత్తిమీద మోసుకుంటూ బరువు భారంతో స్థానిక డీలర్ల దయా దాక్షిణ్యాలతో గంటల తరబడి క్యూలో నిలబడి వేచిఉండే దుస్థితిని మళ్లీ పేదలకు కూటమి సర్కారు తీసుకువచ్చిందని ప్రభుత్వ తీరుతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ముమ్మాటికీ పేదలను కష్టాలకు గురిచేసి రోడ్డుపాలుచేసే ప్రక్రియేనని ప్రభుత్వ తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీపురం మండలంలోని ఎమ్మార్‌నగరం రేషన్‌షాపు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు, గ్రామస్తులు

వృద్ధురాలిని ఎక్కడి వెళ్లగలను



నేను వృద్ధురాలిని. గ్రామానికి దూరంగా ఉన్న కాలనీలో ఉన్నాను. గ్రామంలో ఉన్న రేషన్ డిపో నుంచి సరుకులు తెచ్చుకునేందుకు ఆరోగ్యం సహకరించదు. ఇంకో దిక్కు లేక పోయినప్పటికీ జగనన్న ప్రభుత్వంలో ఎండీఎం వాహనం ద్వారా ఇంటిముందుఎకు వచ్చి బియ్యం, పప్పు, పంచదార ఇచ్చేవారు. తాజాగా ఎండీఎం వాహనం రాదని, రేషన్ డిపోకు వెళ్ళి సరుకులు విడిపించుకోవాలని వీఆర్వో చెప్పడంతో ఆందోళనగా ఉంది. రద్దు చేసిన ఎండీఎం వాహనాల ద్వారా సరుకులు ఇళ్లవద్దే ఇచ్చే విధంగా చర్యలుతీసుకోవాలి.

– పిట్టల రాములమ్మ, వృద్ధురాలు, గెద్దలుప్పి

పథకాల్లో మార్పు సరికాదు



రేషన్ సరుకుల కోసం వ్యయ ప్రయాసలతో ఎదురుచూస్తూ పనులు మానుకుని ఒక రోజంతా ఈ పనికోసమే వెచ్చించాల్సిన దుస్థితి మళ్లీ పునరావృతం అవుతోంది. మా ప్రాంతంలో రేషన్ పంపిణీ దుకాణానికి వివిధ గ్రామాల నుంచి కిలోమీటర్ల మేర నడిచి సరుకుల కోసం వేచిఉండి ఒక పక్క వాటిని మోసుకుని ఇళ్లకు చేరే పరిస్థితి, మరోపక్క ఆటో చార్జీలు ఇలా ఉచిత రేషన్ పంపిణీలో అదనపు భారం పేదవారిపై పడుతుంది. గతంలో ఎక్కువమంది ఒకేసారి రావడంతో సర్వర్లు మొరాయిస్తూ అక్కడే పడిగాపులు కాయాల్సిన దుస్థితి మళ్లీ ప్రభుత్వ రేషన్ షాపుల వద్ద పంపిణీ నిర్ణయంతో పాత సమస్య ఏర్పడనుంది.

– ఉరిటి అప్పలనాయుడు, ఎమ్మార్‌నగరం

ఎండీయూ రద్దుతో అదనపు భారం

- రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలని డిమాండ్



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ (ఫైల్)

పార్వతీపురం: ఎండీయూ వాహనాలు రద్దుచేసి సరుకుల పంపిణీ రేషన్ దుకాణాలకు అప్పగించడం వల్ల తమకు అదనంగా ఒరిగేదేమీ లేదని డీలర్లు వాపోతున్నారు. జూన్ నెల నుంచి పాత విధానంలో రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ వల్ల అదనపు పనిభారం పెరుగుతుందని పేర్కొంటున్నారు. జిల్లాలోని రేషన్ కార్డుదారులకు డీలర్లు ఇకపై రేషన్ పంపిణీ చేయనున్నారు. గత నెలవరకు ఎండీయూ వాహనాలకు సరుకును అందించడం వరకు మాత్రమే డీలర్ పని ఉండేది. బియ్యం, పంచదార కిలోకు ఒక రూపాయి కమీషన్ వచ్చేది. అలాగే గోనె సంచులను విక్రయించగా కొంతమొత్తం వచ్చేది.

అదనపు ఖర్చులు

ప్రభుత్వ తాజా నిర్ణయంతో నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయని డీలర్లు చెబుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి దుకాణం అద్దెకు తీసుకోవడం, కరెంటు బిల్లులు, ఈ పోస్ మిషన్‌కు నెట్ కనెక్షన్, రేషన్ షాపులో తూనిక చేసేందుకు ఒక సహయకుడు ఇలా ఖర్చులు పెరుగుతున్నాయని డీలర్లు వాపోతున్నారు. అధికారుల తనిఖీలు, రికార్డుల నిర్వహణ వంటి అదనపు పనులు ఉంటాయని డీలర్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటికి రేషన్‌ను తీసుకెళ్లడం కూడా అదనపు భారమేనని వాపోతున్నారు. ప్రస్తుతం డీలర్లకు బియ్యం, పంచదారపై కిలోకు ఒక రూపాయి చొప్పున ప్రభుత్వం కమీషన్ ఇస్తోంది. వాస్తవానికి కేంద్రం డీలర్లకు రూ.3లు, రాష్ట్రం మరో ఒక రూపాయి కలిపి రూ.4 ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.ఒక్క రూపాయి కమీషన్ ఇచ్చి చేతులు రాష్ట్ర ప్రభుత్వం దులుపుకుంటోందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్, బియ్యం తరుగుపై ప్రశ్నిస్తే దాడులు పెంచి, దుకాణాలను రద్దు చేస్తారనే భయంతో డీలర్లు ప్రశ్నించేందుకు ముందుకు రావడంలేదు. ఎండీయూ వాహనాల ఖర్చు తగ్గిన నేపథ్యంలో తమ కమీషన్ పెంచాలని డీలర్లు కోరుతున్నారు.

కూటమి సర్కార్ ఫెయిల్యూర్

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

పార్వతీపురం: పదోతరగతి పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 23న విడుదల చేయగా ఫలితాల్లో చాలా మంది విద్యార్థులు ఫెయిల్ అవడంతోపాటు మార్కులు కూడా తక్కువగా వచ్చాయని, ఆత్మహత్యా యత్నాలు విద్యార్థులు చేసుకున్న సందర్భాలు ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఎన్నడూ లేని విధంగా 22 రోజులకే ఫలితాలు విడుదల చేశామని ప్రచార ఆర్భాటంలో ఉన్న శ్రద్ధ రిజల్ట్స్‌లో జరిగిన వైఫల్యంపై దృష్టి సారించలేదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 66,363 మంది విద్యార్థులు రీ వాల్యూషన్‌కు అప్లైన్ చేసుకోగా అందులో ఇప్పటికే ఫెయిల్ అయిన 11వేల మంది పైచిలుకు విద్యార్థులు పాసవడమే కాకుండా మరికొంతమంది విద్యార్థుల మార్కుల శాతం కూడా పెరిగిందన్నారు. ఈ కారణంగా చాలా మంది విద్యార్థులు ఐఐఐటీ సీట్లు కూడా కోల్పోయిన పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులే స్వయంగా వారి బాధను వెళ్లబుచ్చే పరిస్థితి ఉందని రవికుమార్ గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు ఫలితాల్లో జరిగిన వైఫల్యంపై విద్యాశాఖమంత్రి ఎక్కడా స్పందించలేదని, పరిష్కారానికి అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కనీసం ఒక్క స్టేట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ ఈ కూటమి సర్కార్ ఫెయిల్యూర్ అని రవికుమార్ అన్నారు.

పంట దిగుబడికి ఆధునిక పద్ధతులు అవలంబించాలి

- శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు

సీతానగరం: రైతులు అధిక దిగుబడులకు ఆధునిక పద్ధతులు అవలంబించాలని ఐసీఏఆర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు, ఎక్స్టెన్షన్ శాస్త్రవేత్త అనంత్ విహారి అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని కామందొరవలస గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం రస్తా కుంటుబాయి వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ సహాయ సంచాలకుడు మాట్లాడుతూ ఖరీఫ్ ముందస్తు విత్తన ప్రణాళికను తెలియచేస్తూ నవధాన్య సాగు కోసం, కట్టెలు, జీలుగ సాగు కోసం వివరించారు. వ్యవసాయం చేసే ప్రతి ఒక్క రైతు ఆధునిక పద్ధతులు అవలంబించి వ్యవసాయం చేసినట్లయితే మంచి లాభాలు పొందుతారని, తద్వారా దేశం కూడా ప్రగతి పథంలో నడవడానికి తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. అలాగే కౌలు రైతు కార్డులు, ఎరువుల యాజమాన్యం, పంటల బీమా గురించి తెలియజేశారు. రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను, నూతన వంగడాలను అవలంబిస్తూ ఒకే పంట విధానం కాకుండా అంతరపంటల వ్యవస్థను ఏర్పరుచుకుని సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. శాస్త్రవేత్త డాక్టర్ అనంత్ మాట్లాడుతూ పశుసంపద ఆధునిక పద్ధతుల వైపు మళ్లాలని బ్లాక్ బెంగాల్ మేకల పెంపకం ద్వారా అధిక ఆదాయాన్ని పొందుతారని ఈ విధానాన్ని కూడాపాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకుడు వెంకటేష్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనంత్ విహారి, ఏఈఓ పి.లక్ష్మణ్, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.యశ్వంత్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వేడుకగా రాజన్నదొర పుట్టిన రోజు



మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరకు కేక్ తినిపిస్తున్న సతీమణి రోజమ్మ

సాలూరు: వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పుట్టిన రోజుకు వేల సంఖ్యలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. రాజన్నదొర పుట్టిన రోజు వేడుకలను పట్టణంలో ఆయన స్వగృహం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజన్నదొరకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు పట్టణంతో పాటు సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల నుంచి వేల సంఖ్యలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చి రాజన్నదొరపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అందరి సమక్షంలో రాజన్నదొర కేక్ కట్ చేశారు. ఆయన సతీమణి రోజమ్మ,కుమారుడు పవన్‌దొర, నాయకులు రాజన్నదొరకు కేక్ తినిపించారు. పార్టీ క్యాడర్ బాణసంచా కాల్చారు. జై రాజన్నదొర,జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. వేలసంఖ్యలో ప్రజలు వచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపగా వారందరికీ రాజన్నదొర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజన్నదొర పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలో పట్టణంతో పాటు మండలాల్లో కార్యకర్తలు,అభిమానులు ఫ్లెక్సీలు పెట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



రాజన్నదొరకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన జనసందోహం

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు

తన పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని రామా కాలనీలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో రాజన్నదొర కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.

మలేరియా నివారణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆదేశాల మేరకు మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్. టి. జగన్‌మోహన్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్యసిబ్బందితో కలిసి మలేరియా నివారణకు సంబంధించిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో డా. జగన్‌మోహన్ మాట్లాడుతూ దోమల నిర్మూలనతో మలేరియా నివారించవచ్చని వాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంటే మనందరిలో మార్పుతో సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి సారించాలని మారుమూల, గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో జ్వర లక్షణాలు సత్వరమే గుర్తించి వైద్యసిబ్బంది పరీక్షలు నిర్వహించాలని కోరారు. సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. జూన్1నుంచి నెలాఖరు వరకు మలేరియా మాసోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శతశాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ ఖాళీలను శతశాతం గిరిజన నిరుద్యోగ అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.సురేంద్ర డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన జీపు జాతా కురుపాం మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ వద్దకు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల పోస్టులను సాధారణ ప్రాంతాల అభ్యర్థులతో భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా మెగా డీఎస్సీలోని గిరిజన పోస్టులను గిరిజనుల ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషలో కలిపి ఇవ్వాలన్నారు. జీవో నంబరు 3ను పునరుద్ధరించడమో లేకపోతే దాని స్థానంలో మెరుగైన జీవో తీసుకురావడమో త్వరగా చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం నాయకుడు కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

- డీఎస్పీ భవ్యారెడ్డి

రామభద్రపురం: మాదక ద్రవ్యాలు,నిషేధిత వస్తువుల అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. మండలం పరిధిలోని కొండకెంగువ,రావివలసల మధ్యలో నిర్మిస్తున్న గ్రీన్ హైవేపై పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటుకు సీఐ కె.నారాయణరావుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రామభద్రపురం మండల కేంద్రం అంతరరాష్ట్ర కూడలి కావడంతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాలకు బోర్డర్‌లో ఉన్నందున ఈ హైవే మీదుగా గంజాయి,ఖైనీ గుట్కా,నల్ల మందు వంటి మాదక ద్రవ్యాలు, నిషేధిత వస్తు వులు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. 26వ నంబరు జాతీయ రహదారి కొట్టక్కి వద్ద పోలీస్ చెక్ పోస్టు, స్థానిక బైపాస్ రోడ్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేశామని, అలాగే గ్రీన్ హైవేపై కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు ఎస్ఐ వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



శివరాంపురం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

- సుభద్ర, శివరాంపురం గ్రామాల్లో దాహం కేకలు

బలిజిపేట: మండలంలోని సుభద్ర, శివరాంపురం గ్రామాల్లో తాగునీరు అందక అల్లాడుతున్నామని, దాతల సహకారంతో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు అందోళన చెందుతున్నారు. గ్రామంలో తాగు నీరు అందకపోవడంతో పొలాల్లో ఉన్న మోటార్ల వద్ద నుంచి నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు చెబుతున్నారు. గ్రామంలో బోర్లు సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. దాతల సహకారంతో వచ్చిన ట్యాంకర్లలో నీరు కాస్త ఊరట కలిగిస్తోందని, అది చాలకపోవడంతో పొలంలో మోటార్ల నుండి తెచ్చుకుంటున్నామన్నారు. ఎన్ని రోజులు ఇటువంటి ఇబ్బందులు పడుతామని ఎవరిని అడిగినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై సీపీఎం నాయకులు మన్మథరావు, సత్యం, జగన్నాథంలు మహిళలను కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. తాగునీటి సమస్య తీర్చకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముట్టడిస్తామని మన్మథరావు హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

జాతి వైరం మరిచి..

- ఆకట్టుకుంటున్న పిల్లి, కుక్క స్నేహబంధం



కుక్క, పిల్లికి జాతి వైరం. ఆ రెండు ప్రాణులు కలిసి ఉండడం అరుదు. అటువంటి సంఘటనే పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం బుడ్డిపేట గ్రామంలో కనిపించింది. బుడ్డిపేట గ్రామానికి చెందిన శంకరాపు వెంకటరమణ మండలకేంద్రంలో జిరాక్స్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన ఇంట్లో రెండుసంవత్సరాలుగా పిల్లి, కుక్క చిన్నప్పటి నుంచి చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ కనువిందు చేస్తున్నాయి. ఒకే కంచంలో తింటూ ఒకే దగ్గర పడుకుంటాయి. ఒకదానొకటి ముద్దులు పెట్టుకుని చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

–సీతానగరం

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్



జీపుజాతా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం రావికోనలో ర్యాలీ నిర్వహించిన రాష్ట్ర ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

మక్కువ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర, ఎర్రసామంతవలస, మార్కొండపుట్టి గ్రామాల్లో ఆదివారం జీపుజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర, మన్యంజిల్లా నాయకుడు రామస్వామిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గిరిజన ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ గిరిజన అభ్యర్థులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులు మినహాయించి గిరిజన ప్రాంతానికి 100శాతం గిరిజన అభ్యర్థులతో నియామకాలు చేయాలని హామీ ఇచ్చి డీఎస్సీ ప్రకటనలో గిరిజన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం రాష్ట్రవ్యాప్తంగా చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం పాలన ఏడాది గడుస్తున్నప్పటికీ, గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వెంటనే పై సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో రానున్నరోజుల్లో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం రాష్ట్రనాయకులు అశోక్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు, ఆదివాసీ గిరిజనసంఘం మండల నాయకులు ప్రభాకర్‌రావు, అరులప్ప, రామారావు, ప్రజానాట్య మండలి జిల్లా నాయకుడు ఈశ్వరరావు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రాజశేఖర్, సీఐటీయూ నాయకుడు ఎన్ వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.